క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..


సూరిబాబును అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరం లారీ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గంధం సూరిబాబు శనివారం మండపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సూరిబాబును అభినందిస్తూ రవాణ రంగంలో ఆధారపడిన అన్ని వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. అందుకోసం తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. సూరిబాబును అభినందించిన వారిలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, అల్లంపల్లి కిశోర్ , కూసు అబ్బు, లారీ యూనియన్ సభ్యులు ఉన్నారు.

బీసీల ఐక్యతే లక్ష్యంగా కార్యాచరణ


నూతన సంఘ సభ్యులను అభినందిస్తున్న జిల్లా నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): బీసీ సామాజిక వర్గీయుల ఐక్యతే లక్ష్యంగా రానున్న రోజుల్లో కార్యాచరణ చేయనున్నట్టు బీసీ సంఘం క్రమశిక్షణ విభాగం నాయకులు కోన సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు పిల్లి శ్రీనివాస్ అన్నారు. మండపేట నాయీ బ్రాహ్మణ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ ఉప కులాలు వారీగా ప్రణాళికాబద్ధంగా సమావేశాలను నిర్వహిస్తూ ఐక్యతను సాధించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సంఘం మండపేట పట్టణ అధ్యక్షుడిగా మల్లువలస గణపతిరావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తీగిరెడ్డి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరమల్లు శ్రీనివాసు, పెంకె గంగాధరరావు, గోరు అన్నవరం, పితాపురం సత్యనారాయణ, కోటిపల్లి కృష్ణ, టేకి భీమేశ్వరావు, చుక్కల అప్పారావు, పిల్లి సత్తిబాబు, బలగం శ్రీను, రాజన శ్రీను, రామోజు కృష్ణ పాల్గొన్నారు.

అభద్రతా భావంలో వేగుళ్ల

గవర్నర్‌కు లేఖరాయడంపై ఎమ్మెల్సీ తోట స్పందన


మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ఓటమి భయం పట్టుకుందని, అభద్రతా భావంలో కొట్టిమిట్టాడుతున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజమెత్తారు. మండపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జోగేశ్వరరావుకు రోజురోజుకూ ప్రజాదరణ తగ్గుతోందని, దీంతో అసహనానికి గురై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. పారదర్శకంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ లబ్ధి అందుతుండడంతో వైఎస్సార్ సీపీపై ప్రజాదరణ పెరగడాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జీర్ణించుకోలేక గవర్నర్‌కు లేఖ రాశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల విగ్రహాలను మండపేట పట్టణం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయాలన్న ఆలోచన మూడు సార్లు ఎమ్మెల్యేగానూ, మున్సిపల్ చైర్మన్‌గానూ పని చేసిన జోగేశ్వరరావుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 2014, 2015లలో జోగేశ్వరరావు శాసనసభ్యుడిగా ఉండగా ఇసుక ర్యాంపుల్లోనూ, గ్రావెల్ తవ్వకాల్లోనూ జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని తాను కూడా లేఖ రాస్తానన్నారు. ఎమ్మెల్యే అక్రమాలు నేపథ్యంలోనే కేశవరం ప్రాంతంలో కేంద్రం నెలకొల్పదల్చిన పెట్రో కెమికల్ యూనివర్సిటీ ఏర్పాటు వెనక్కి వెళ్లిపోయిందన్నారు.

అయ్యప్ప స్వాముల ర్యాలీ


అంగర ప్రధాన రహదారిలో నృత్యంచేస్తున్న అయ్యప్ప మాలధారులు

కపిలేశ్వరపురం: అంగరలో అయ్యప్ప మాలధారులు ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. డప్పు వాయిద్యాలు నడుమ స్వామిని కీర్తిస్తూ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. గ్రామంలోని అయ్యప్ప పీఠాలలోని మాలధారులు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రధాన రహదారుల్లో మాలధారులు జరిపిన ర్యాలీకి భక్తులు ఘన స్వాగతం పలికారు.


కూళ్లల్లో రోడ్డుపై ఉంచిన ధాన్యం బస్తాలు


పామర్రులో గట్లపై ఆరబెట్టిన ధాన్యం

అన్నదాత గుండెల్లో గుబులు

- ముంచుకొస్తున్న తుపాను
- పంట ఒబ్బిడిలో రైతులు

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరిత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉన్న తరుణంలో ఇప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తోందని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపరం మండలంలో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారు 50శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్ల మీద, పొలం గట్లపై రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు పనలపై ఉంచారు. ఇలాంటి పరిస్థితిల్లో వర్షాలు పడితే పంటకు భారీ నష్టం వాటిల్లుతుందని ఆవేదన చెంతున్నారు. అందినకాడల్లా అప్పులు చేసి ప్రస్తుతం తొలకరి పంటను సాగు చేశామని పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే అప్పుల పాలైపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను వల్ల రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే శనివారం మధ్యాహ్నం ఆకాశం మేఘాలు చుట్టుముట్టి ఈదర గాలులు వీస్తున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని బరకాలతో కప్పుతున్నారు. ఆరుదల వచ్చిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు.


ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు


పడమర ఖండ్రికలో ధాన్యం ఆరుదలను పరిశీలిస్తున్న ఏఓ రమేష్‌కుమార్

అల్పపీడనంపై అప్రమత్తం

కపిలేశ్వరపురం: అల్పపీడనంపై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలోని పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బందికి ఆదివారం సెలవును రద్దు చేసింది. గ్రామాల్లో నివాసిత ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాల్లోని పంట పరిరక్షణ కోసం అధికారులకు బాధ్యతలను నిర్దేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. సచివాలయ ఉద్యోగులు, రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకులు శనివారం రైతులకు చేదోడుగా నిలిచారు. రహదారులపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకుంటుండగా వారు సాయం చేశారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను హెచ్చరికలు నేపథ్యంలో మూడు రోజుల పాటు పంటను కోయవద్దన్నారు. కోసిన పంట ఆరుదలపై శాస్త్రీయ సూచనలు చేశారు.

ఎమ్మెల్సీ తోటకు సత్కారం


మండపేటలో ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న దళిత నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణ ప్రధాన రహదారిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలను నెలకొల్పేందుకు నిర్ణయించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను మండపేట పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం దళిత నాయకులు ఘనంగా సత్కరించారు. దళితుల దీర్ఘకాలిక ఆకాంక్షను ఎమ్మెల్సీ తోట నెరవేర్చుతున్నారని, కౌన్సిల్‌లో తీర్మానానికి కృషి చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కౌన్సిలర్లకు అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన దళిత నాయకులు ఎమ్మెల్సీ తోటకు శాలువా కప్పి సత్కరించారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ మండపేట పట్టణ చరిత్రకు ఇది సువర్ణ అధ్యాయమన్నారు. దళితులు ఆరాధ్యదైవంగా కొలిచే మహనీయుల విగ్రహాలను మండపేట పట్టణంలో నెలకొల్పడం సాహసోపేతమైన కృషి అన్నారు. మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి చేస్తుంటే ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుకు కృతజ్ఞతలు చెబుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు ధూళి జయరాజు తీరును వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ తప్పుపట్టారు. ద్వంద వైఖరిని జయరాజు వీడాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు పలివెల సుధాకర్, పలివెల మధు, ముమ్మిడివరపు బాపిరాజు,పాలింకి కిశోర్, తుపాకుల ప్రసన్నకుమార్, నక్కా సింహాచలం, వల్లూరి రామకృష్ణ, మల్లిపూడి శివకుమార్, కోనాల చంద్రబోస్, యేలేటి గంగరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం


శేరిలంకలో రైతులకు పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు


కాజులూరులో లబ్ధిదారులకు భూముల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి చెల్లుబోయిన వేణు
- పేదలకు పట్టాల పంపిణీ

కాజులూరు: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం కాజులూరులో మండల గ్రామాలకు చెందిన 276 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల పట్టాలను మంత్రి వేణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఇనామ్, లంక భూముల రైతులకు బారీమేలు చేసేలా ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందన్నారు. దశాబ్దాల కాలంగా భూములు తమ స్వాధీనంలో ఉన్నా వాటిపై పూర్తి హక్కులు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఈ భూములకు హక్కులు కల్పించేందుకు గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచనలు చేయలేదన్నారు. సీఎం జగనన్న తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయం ద్వారా లబ్ధిదారులు వారి భూములపై పూర్తి హక్కులు పొందగలిగారన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న జగనన్నను ప్రజలు మరోసారి సీఎంను చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, మండల తహసీల్దారు సాయిసత్యనారాయణ, ఆర్‌ఐ వేగేశ్వరావు, గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని, పోతురాజు బాబూరావు, దంగేటి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

శేరిలంక గ్రామంలో...

కె.గంగవరం: శేరిలంక గ్రామంలో శనివారం పేద రైతులకు ఐదేళ్ల లీజుపై భూ పట్టాలను మంత్రి వేణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి లంక గ్రామాల్లో పేద రైతులంగానికి చేదోడుగా ఉండేందుకు ప్రభుత్వ పట్టా భూములు లీజుకు ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగానే శేరిలంక గ్రామంలో 277 మంది రైతులకు ఐదేళ్ల లీజుపై పట్టాలను అందించామన్నారు. ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటి చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్ కొండేపూడి భద్రరావు, ఎంపీటీసీ కొండేపూడి అప్పారావు, తహశీల్దార్ వైద్యనాధ శర్మ, కన్వీనర్ కొండేపూడ చంటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీవో

రామచంద్రపురం: ఓటరు నమోదు మార్పులు చేర్పులు ఉంటే ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఎస్.సుధాసాగర్ సూచించారు. రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను తనిఖీ చేశారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను బీఎల్‌ఓవలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుతో పాటుగా అన్ని రకాల సేవలను ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా చేస్తారన్నారు. ఆదివారం కూడా పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఓటరు నమోదు శిబిరాల పరిశీలన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని నున్న వారి వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాన్ని శనివారం ఓటరు నమోదు అధికారి, రామచంద్రపురం ఆర్డీఓ ఎస్, సుదా సాగర్ పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఫాం-6, ఫాం-7, ఫాం-8లకు సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపులు గురించి జాగ్రత్తగా వ్యవహరించాలని బీఎల్‌ఓలకు సూచించారు. నిబంధనల ప్రకారం మార్పులు, చేర్పులు, తొలగింపులు జరగాలని తెలిపారు.

సిబ్బందికి సూచనలు

మండల పరిధిలోని వెల్ల, జేకే పాలెం, ద్రాక్షారామ, అన్నయిపేట, తోటపేట, కె.గంగవరం తదితర గ్రామాల్లో శనివారం డీఎల్‌డీఓ, నియోకవర్గ ఓటరు నమోదు ప్రత్యేక అధికారి ఎ.శాంతి నమోదు ప్రక్రియను పరిశీలించారు. బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

యువత ఓటు నమోదు చేసుకోండి

రాయవరం: యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో ఎస్.సుధాసాగర్ పిలుపునిచ్చారు. మండలంలోని 53 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓట్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. పసలపూడి, చెల్లూరు పోలింగ్ స్టేషన్లను శనివారం ఆర్డీవో, తహసీల్దార్ తదితరులు తనిఖీ చేశారు. స్టేషన్లలో ఓట్ల నమోదు ప్రక్రియను ఆర్డీవో పరిశీలించారు. సెక్టోరియల్ అధికారులు మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చైతన్యకుమారి, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, యరమాటి సూర్యనారాయణ, మండల పరిషత్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్, తహసీల్దార్ కేజీ ప్రకాష్‌బాబు తదితరులు పోలింగ్ స్టేషన్లు పరిశీలించారు. ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని, ఓటర్లు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


పట్టణంలోని పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో సుధాసాగర్

824 దరఖాస్తుల స్వీకరణ

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని పోలింగ్ స్టేషన్లలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో రెండో రోజు శనివారం దరఖాస్తులను స్వీకరించారు. ఆయా శిబిరాల్లో మొత్తం 824 దరఖాస్తులను స్వీకరించినట్టు తహసీల్దార్లు టీఆర్ రాజేశ్వరరావు, కొమరం సూర్యారావు తెలిపారు. మండపేట అర్బన్‌లో ఫారం-6కు 182, ఫారం-7కు 50, ఫారం-8కు 124 మొత్తం 356, రూరల్ మండలంలో ఫారం-6కు 76, ఫారం-7కు 14, ఫారం-8కు 36 మొత్తం 126 దరఖాస్తులు వచ్చాయి. రాయవరం మండలంలో ఫారం-6కు 120, ఫారం-7కు 51, ఫారం-8కు 69 మొత్తం 240, కపిలేశ్వరపురం మండలంలో ఫారం-6కు 62, ఫారం-7కు 21, ఫారం-8కు 19 మొత్తం 102 దరఖాస్తులు అందాయి. నియోజకవర్గం మొత్తంలో ఫారం-6కు 440, ఫారం-7కు 136, ఫారం-8కు 248 మొత్తం 824 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్లు తెలిపారు.


కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆలీ

ఓటు ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్

కపిలేశ్వరపురం: ఓటు ప్రజాస్వామ్యానికి ఆక్సిజన్ లాంటిదని మండలంలోని 19 గ్రామాల్లో ఓటు నమోదు కార్యక్రమాల్లో విధులు నిర్వహించిన అధికారులు అన్నారు. అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో శుక్రవారం ఓటు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి మహ్మద్ ఆలీ, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ మాట్లాడుతో ఓటు నమోదు ప్రక్రియను వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ వాకా దివ్యశేఖర్, కరస్పాండెంట్ వాకా రాజా, ప్రిన్సిపాల్ పి.రమణ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటు నమోదు, సవరణ, మార్పుల దరఖాస్తులను స్వీకరించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

కాజులూరు: కోలంక ఉమాసోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. వీటితోపాటు హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక సుబ్రహ్మణ్యశర్మ, ఇంద్రగంటి వీరభద్రంలు 15 మంది వేదపండితులతో ఈ పూజా కార్యక్రమాలు చేశారు. ఆర్యావైశ్య సంఘం సభ్యులు వరాద వెంకటనాగేశ్వర్రావు, వెంకటరమణమూర్తి, రామలక్ష్మీభవాని, చిన్నమాంబ, వారనాశి వెంకన్న, బోడ్డు చంద్రశేఖర్, తదితరులు భక్తులకు వసతుల కల్పనలో సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా లక్ష తులసి పత్రి పూజ

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరంలోని శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో శనివారం లక్ష తులసి పత్రి పూజ, హోమం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు.

మండల, బూత్ కమిటీల ఎంపికపై సమావేశం

రాయవరం: వైఎస్సార్ సీపీ మండల కమిటీ, బూత్ కమిటీల ఏర్పాటుపై ఆ పార్టీ నాయకులు సమావేశమయ్యారు. మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు రాయవరం మండల పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాయవరంలోని పార్టీ కార్యాలయంలో కొత్తగా ఏర్పాటు చేసే మండల కమిటీ, బూత్ కమిటీలపై చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తమలంపూడి గంగాధర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సిరపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, మండల రైతు భరోసా కమిటీ చైర్మన్ కోట బాబురావు, మండల సేవాదళ్ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి, మండల బూత్ కమిటీ కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, సర్పంచ్ చంద్రమల్ల రామకృష్ణ, సీనియర్ నాయకులు అచ్యుతరామరాజు, మండల కోఆప్షన్ సభ్యులు సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.50,116 విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన చెరుకూరి అజిత్, రమ్యశ్రీ దంపతులు రూ.50,116 విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

వైకల్యాన్ని ఓడించి.. జీవితాన్ని జయించి..

- ముందుకు సాగుతున్న దివ్యాంగులు
- వారికి తోడుగా నిలుస్తున్న ప్రభుత్వం
- నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కపిలేశ్వరపురం: జీవితం కొందరికి పూలపానుపు. మరికొందరికి ముళ్లబాట. మంచి చెడ్డల కలగొలుపు సమాజంలో సమస్యలను ఎదురొడ్డిన జీవితాలకు చరిత్రలో సరైన స్థానం ఉంటుంది. సవ్యాంగాలతో జీవించడం సర్వసాధారణం. పుట్టుకుతోనో, విధి వంచించడంతోనో అవయవాలను కోల్పోవడం జీవితాన్ని అతలాకుతలం చేస్తాయి. అలాంటి నేపథ్యమున్న అనేక మంది దివ్యాంగులు మనోనిబ్బరంతో ముందుకు సాగుతున్నారు. వారికి ప్రభుత్వమూ అండగా నిలుస్తుంది 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నేపథ్యంలో ఈ కథనం...

వికలాంగుల చట్టం 2016 ఏం చెబుతుందంటే..

శారీరకంగా, మానసికంగా వైకల్యం కలిగిన వారిని దివ్యాంగులుగా పరిగణిస్తున్నారు. 2016 డిసెంబర్ 16న దేశంలో వికలాంగుల చట్టం (ఆర్‌పీడీ) యాక్ట్ అమలులోకి వచ్చింది. ఆత్మ గౌరవం, వ్యక్తి స్వేచ్ఛ, అవకాశాల పెంపు, సామాజిక భద్రత లక్ష్యంగా ఈ చట్టం రూపొందింది. ఏడు రకాల వైకల్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకునే ఆ సంఖ్యను 21కి పెంచారు. వికలాంగుల రిజర్వేషన్ శాతాన్ని మూడు నుంచి నాలుగు శాతానికి పెంచారు. వికలాంగులపై దాడి చేసినా, వివక్ష చూపినా ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకూ జైలు శిక్ష , రూ.10 వేలు నుంచి రూ.5 లక్షలు వరకూ జరిమానా విధిస్తారు.



మండపేటలోని భవిత కేంద్రం

మొక్కవోని దీక్షతో...

సరిపల్లికి చెందిన బీరా లావణ్య 31 ఏళ్ల యువతి. ఆమెది సరిపల్లి. పేదరికం ఉన్నా చదువుపై ఇష్టంతో అమలాపురంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. డిగ్రీ డిస్టెన్స్‌లో చేసి, పరీక్ష ఫలితాలు కోసం వేచి చూస్తోంది. ఇంతలో వెన్నెపూసలో గడ్డలేవడంతో నొప్పి బాధించనారంభించింది. గడ్డ తొలగించేందుకు 2012 ఆగస్టు ఒకటిన శస్త్ర చికిత్స చేయగా కాలినరాలు దెబ్బతిన్నాయి. ఇక నడవలేని పరిస్థితికి చేరింది. 2014తో డిగ్రీ చదువు పూర్తి చేసింది. 2019లో హార్ట్‌స్ట్రోక్‌తో నాన్న బాలరాజు మరణించడం మరో సమస్య వచ్చి పడింది. అమ్మకు తోడుగా ఉంటా విద్యుత్ అమర్చిన కుట్టుమిషన్ సాయంతో టైలరింగ్ చేసుకుంటుంది. ఆమె మరికొంత మందికి నేర్పుతూ అమ్మతో కలిసి అడుగులు వేస్తోంది. కాలుతో చేయాల్సిన పనిని చేతితో చేస్తుంది. అమలాపురం సమీపంలోని సరిపల్లిలో ఒక చిన్న గదిలో మనో నిబ్బరంతో ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తోంది.


కుట్టు పని చేస్తున్న లావణ్య

జీవిత పాఠాలను బోధించాలన్న లక్ష్యంతో


బ్రెయిలీతో పాఠం చెబుతున్న దొరబాబు

ఆడుకుంటూ తోటి పిల్లలతో సరదాగా గడుపుతున్న పత్తి దొరబాబు తొమ్మిదేళ్ల వయస్సులో కంటి నరాల్లో రక్త ప్రసరణ సమస్య తలెత్తడంతో చూపుపోయింది. కుడుపూరులో వ్యవసాయ కుటుంబానికి చెందిన దొరబాబు జీవితం ఒక్కసారిగా చీకటిలోకి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బడి మానిపించారు. బడి వాతావరణం, స్నేహితులు లేకపోవడంతో పొలం గట్లపైకి వెళ్లి ఏడ్చేవాడు. తన బాధను చూడలేక తల్లీదండ్రులు మండపేట అంధుల పాఠశాలలో చేరిపించారు. అక్కడ విద్యను పూర్తి చేశారు. రామచంద్రపురం కృత్తిపేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో హెచ్ఈసీ చదివారు. కళాశాలలో తోటి విద్యార్థులు హేళన చేయగా అధ్యాపకులు చదువులో ప్రోత్సహించారు. ఆ స్ఫూర్తితో ఉపాధ్యాయుడు కావాలనుకున్నారు. ఆర్యవటంలో 2009-11 విద్యాసంవత్సరం టీటీసీ పూర్తి చేశారు. 50 మందిలో మొదటి స్థానంలో నిలిచారు. 2012 డిసెంబర్‌లో సామర్లకోటలో ఉపాధ్యాయ ఉద్యోగం దక్కింది. ప్రస్తుతం రామచంద్రపురం శాంతినగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. వైకల్యంతో పాఠం చెప్పలేరన్న దృష్టితో తన కృషిని తక్కువ చేసిచెప్పుకోవడాన్ని గమనించారు. పిల్లలకున్యాయం చేయాలన్న లక్ష్యంతో బ్రెయిలీ పుస్తకాలను అధ్యయనం చేస్తూ బోధనా పద్ధతలను మెరుగుపర్చుకుంటూ మంచి మాష్టారనిపించుకుంటున్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

విభిన్న ప్రతిభావంతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం నిలుస్తోంది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ మెరుగైన సంక్షేమాన్ని అందిస్తోంది. వైస్సార్ పెన్షన్ కానుక పేరుతో జిల్లాలో ఠంచనుగా ఒకటో తేదీకి 32,443 మందికి రూ.3వేలు చొప్పున పింఛనును వలంటీర్ల ద్వారా ఇంటికి తీసుకెళ్లి అందిస్తోంది. గతంలో రాష్ట్రంలో 54 ఆసుపత్రుల్లో సదరం సర్టిఫికెట్ల పరీక్షలు చేసేవారు. వైఎస్సార్ సీపీ లో ఆసుపత్రుల సంఖ్యను 173కి పెంచింది. సచివాలయంలోనే సదరం స్లాట్ బుకింగ్ సదుపాయం కల్పించింది. ఇప్పటికే అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లకు సంబంధించి సదరం స్లాట్‌లను విడుదల చేసింది. అమ్మఒడి ఆర్థిక సాయం పొందేందుకు పాఠశాలలో 75 శాతం హాజరు తప్పనిసరి నిబంధనను దివ్యాంగ విద్యార్థులకు మినహాయింపు ఇచ్చింది. ఏపీఎస్ఆర్టీసీ దివ్యాంగులకు ప్రయాణ చార్జిలో 50 శాతం రాయితీ కల్పిస్తోంది. అంధత్వాన్ని ముందుగానే నివారించాలన్న తలంపుతో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా పరీక్షలు చేయిస్తోంది. రాష్ట్రంలో 5.62 లక్షల మందికి కంటి సమస్యలున్నట్టు గుర్తించగా వారిలో 3.12 లక్షల మందికి కళ్లద్దాలు ఇచ్చేందుకు సన్నద్ధమవుతుంది. 48 వేల మందికి కాటరాక్ట్ సర్జరీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.